# ★ జ్యోతిష్యం ★

కృష్ణారావు స్కూల్ ఫైనలు చదువుతున్నాడు. అందరిచేత మంచి తెలివిగలవాడనిపించుకొన్నాడు. అన్నిట్లో అతనివే ఫస్టు మార్కులు. కృష్ణారావుకు అనేక బహుమతులు కూడ వచ్చినాయి.

కృష్ణారావు తండ్రి విశ్వనాథం గారికి జ్యోతిష్యం అంటే ఎంతో నమ్మకం. జ్యోతిష్యం చెప్పగలమనే వాళ్ళందరికీ ఆయనయిల్లు ఒక ధర్మ సత్రం లాగుండేది. తన ఆస్తిలో సగభాగాన్ని ఆయన జ్యోతిష్కుల సత్కారాల క్రింద ఖర్చుపెట్టాడు.

విశ్వనాథం గారికి కృష్ణారావు అంటే అమితమైన ప్రేమ. ఎప్పుడూ కొడుకును గురించే ఆలోచించేవాడు. వాడు ఎంతవరకు చదివేది, వాడికి ఎన్నోఏట పెండ్లి అయ్యేది, యిలాగ వాడి భవిష్యత్తును గురించి ప్రతివిషయం జ్యోతిష్కుల నడిగి తెలుసుకొనేవాడు. కృష్ణారావు జాతకం ఎప్పుడూ జ్యోతిష్కుల చేతిలోనే ఉండేది.

కృష్ణారావుకు జ్యోతిష్యం అంటే తలనొప్పి. జ్యోతిష్యంచెప్పే వాళ్లు బ్రతుకుతెరువు కోసం ప్రజలను మోసగిస్తారని కృష్ణారావు నమ్మకం. తన తండ్రి, వారి మాయలోపడి డబ్బంతా తగలేస్తుంటే చూచి సహించలేక పోయేవాడు. తండ్రితో ఎదురుపడి చెబుదామంటే తగనిభయం. అందుచేత ఏమీ చేయలేక మథనపడేవాడు

ఒకనాడు కృష్ణారావు స్కూలునుంచి తిరిగివచ్చేసరికి విశ్వనాథం గారు జ్యోతిష్కుడి ముందుకూర్చుని ఉన్నారు. జ్యోతిష్కుడు కాగితం మీద కృష్ణారావు భవిష్యత్తును గురించి వ్రాసి విశ్వనాథం గారిచేతి కిచ్చాడు. జ్యోతిష్కుడు వెళ్ళిపోయినతరువాత "ఏం చెప్పాడు నాన్నా" అని కృష్ణారావు అడిగాడు. "నువ్వు ఈఏడు ఫస్టున పాసవుతావట" అంటూ విశ్వనాథం గారు గబాగబా లోనికి వెళ్ళారు.

కృష్ణారావుకి నవ్వు వచ్చింది. ఎలాగైనా తన తండ్రిని జ్యోతిష్యం అంటే అసహ్యించుకొనేటట్లు చేయాలనుకున్నాడు. ఆ రాత్రంతా ఆలోచించాడు. ఒక ఉపాయం తట్టింది.

బండ్లమూడి సుబ్బారావు

రామం కృష్ణారావు స్నేహితుడు. స్కూలుఫైనలు చదువుతున్నాడు. కృష్ణారావు క్లాసులో ఎంతముందుంటాడో రామం అంత వెనక ఉంటాడు. "పరీక్షల్లో తన నంబరు రామం, రామం నంబరు తను వేసేటట్లయితే రామం ప్యాసయి తను తప్పుతాడు. అప్పుడు జ్యోతిష్కుడు చెప్పిన మాట అబద్ధమని ఋజువౌతుంది నాన్నకు జ్యోతిష్యం మీద నమ్మకం పోతుంది" అనుకున్నాడు కృష్ణారావు.

తెల్లవారిన తరువాత ఈవిషయం అంతా రామానికి చెప్పాడు. రామం సంతోషం పట్టలేక పోయినాడు తనుప్యాసౌతాను కదా అని. సరే అన్నాడు రామం. పరీక్షలు దగ్గర కొస్తున్నాయి. రామం దిగులు విచారం లేకుండా హాయిగా తిరుగుతున్నాడు.

పరీక్షలు రానేవచ్చినాయ్. కృష్ణారావు, రామం అనుకొన్న ప్రకారం ఒకళ్ళ నంబరు యింకొకళ్లు పరీక్ష పేపర్లమీద వేశారు.

పరీక్షలైనాయి. శలవలు వచ్చినాయి. కృష్ణారావు తన తండ్రిని మార్చబోతున్నా ననే సంతోషంతో ఉన్నాడు. రామం తను ప్యాసౌతాను అనే సంతోషంతో ఉన్నాడు ఇద్దరు ఇలా హాయిగా శలవులు గడిపారు.

తెల్లవారితే ఆదివారం. రిజల్టు పడతాయని ఆత్రుతతో కృష్ణారావుకు ఆ రాత్రి నిద్రపట్టలేదు.

ఎలాగైతేనేం తెల్ల వారింది. రిజల్టుపడ్డాయి. రామం ఫస్టున ప్యాసయినాడు కృష్ణారావు నంబరు లేదు. కృష్ణారావు సంతోషంతో పేపరు తీసికొచ్చి "ఏంనాన్నా. నేను ఫస్టున ప్యాసౌతానని ఆ జ్యోతిష్కుడు చెప్పాడే మరి నేనుప్యాసు కాలేదే. వాళ్లు చెప్పేవన్నీ అబద్ధాలే" అని కృష్ణారావు ఇంకేదో చెప్ప బోతుండగా "ఏడ్చావులే. తప్పినందుకు ఏడవక పైగా జ్యోతిష్యాన్నే తిడుతున్నావా. వెధవ." అంటూ ఆ రోజు జ్యోతిష్కుడు రాసియిచ్చిన కాగితాన్ని తీసుకొచ్చి కృష్ణారావుకిచ్చాడు. ఆ కాగితంలో యిలావుంది.

"మీ అబ్బాయికి కొంచెం శని పట్టివుంది. ఆ 'శని' మీ అబ్బాయిని యీఏడు ప్యాసుకానీయదు." కృష్ణారావుకు పూర్తిగా చదవక ముందే ఏడ్పువచ్చింది! ★